
సాక్షి పల్నాడు

శుక్రవారం । 18 । జూలై । 2025



బాబాకు ప్రత్యేక పూజలు

పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 560.70 అడుగులకు చేరింది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శివాలయం ఈఓగా గోపి



తాడేపల్లి రూరల్: మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఈఓగా నామని గోపి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తుళ్లూరు గ్రూపు దేవాలయాల ఈఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. కొమ్మూరు గ్రూప్ దేవాలయాల ఈఓగా పనిచేస్తున్న జేవీ నారాయణ ఇక్కడ ఏఈఓగా పని చేస్తున్నారు.

సారాక్షసి గుప్పిట్లో పల్లెలు

- సత్ఫలితాలివ్వని నవోదయం 2.0
- పల్నాడులో విచ్చలవిడిగా నాటు సారా తయారీ
- మాచర్ల, వినుకొండ, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో యథేచ్ఛగా విక్రయాలు
- నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం
- అనారోగ్యం పాలవుతున్న గ్రామీణులు
- శాశ్వత నిర్మూలనలో ప్రభుత్వం విఫలం
- నల్ల బెల్లం సరఫరాలో తెలుగు తమ్ముళ్ల హస్తం

పల్లె నోట.. సారా పాట

పల్లెల్లో నాటు సారా గుప్పుమంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తండాల్లో తయారీ ఊపందుకుంది. పల్నాడు జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో కుటీర పరిశ్రమగా మార్చుకుని మరీ వ్యాపారం చేస్తుండటం ఆందోళన కల్గిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సారా నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంది. పరివర్తన పేరుతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. గ్రామాల్లో మార్పునకు నాంది పలికింది. అయితే, ప్రస్తుత సర్కారు నవోదయం 2.0 పేరిట హడావుడి చేసినా సత్ఫలితాలు ఇవ్వలేదు. దీంతో ప్రజలు సారా రక్కసికి బానిసలై, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. మత్తులో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.



నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో నాటు సారా తయారీ చాపకింద నీరులా విస్తరించింది. కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా తయారు చేసి విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 28 గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలు ఉన్నట్టు ఎక్సైజ్ అధికారులు అధికారికంగా గుర్తించారు. గత నాలుగు నెలల్లో దాడులు నిర్వహించి ఇప్పటికే 32 కేసులు నమోదు చేసి, 21 మందిని అరెస్ట్ చేశారు. 138 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 11,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 28 గ్రామాల్లో 12 గ్రామాలను ఏ కేటగిరీగా, ఆరు గ్రామాలను బీ కేటగిరి, 10 గ్రామాలను సీ కేటగిరిగా విభజించారు.అయితే, నిరంతర నిఘా, పాత నేరస్తుల కదలికలపై ఆరా తీయడం మరిచారు. నాటుసారా పట్టుబడ్డ సమయంలో నిందితులపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. సారా తయారీకి వినియోగించే ముడిసరకు సరఫరా చేసే అక్రమార్కులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మూలాలపై దృష్టి సారించకపోవడంతో నాటుసారా జిల్లాలో రోజురోజుకూ వ్యాపిస్తోంది. తయారీదారులు పదే పదే అదే వ్యాపారాన్ని వృత్తిగా మలుచుకొని నాటుసారా తయారీ చేస్తున్నారు.

శివారు, అటవీ ప్రాంతాల్లో తయారీ

నరసరావుపేట మండలం పమిడిపాడు, నకరికల్లు మండలం చేజర్ల, గుత్తికొండ ప్రాంత తండాలు, వెల్దుర్తి, క్రోసూరు, మాచర్ల, బొల్లాపల్లి, వినుకొండ, యడ్లపాడు మండలాలలోని శివారు అటవీ ప్రాంతాలు, గిరిజన తండాలు, మామిడి తోటలను సారా తయారీ స్థావరాలుగా మార్చారు. గ్రామాల్లో గొడవలకు నాటుసారా కారణమవుతున్నా విక్రయాలు మాత్రం ఆగడం లేదు. కల్తీ నాటుసారా తాగి ఎందరో ఇప్పటికే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ నాటుసారా తయారీని శాశ్వతంగా నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోంది.



మాచర్ల అటవీ ప్రాంతంలో సారా తయారీ కేంద్రం వద్ద ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

హాని కలిగించే ఎరువుల వాడకం

మద్యం ధరలు ప్రభుత్వం నామమాత్రంగా తగ్గించడంతో నాటు సారాకి డిమాండ్ పెరిగింది. మరోవైపు గ్రామాల్లోని బెల్టు షాపులలో క్వార్టర్ బాటిల్ రూ.30 నుంచి రూ.50 దాకా అదనంగా విక్రయిస్తుండటం కూడా సారా వైపు వెళ్లడానికి ప్రధాన కారణం. సారా తయారీలో బెల్లంతో పాటు యూరియా, అమ్మోనియా వంటి రసాయన ఎరువులు, ఇతర మత్తు పదార్థాలు, ట్యాబ్లెట్లు కలుపుతున్నారు. పెద్దపెద్ద ప్లాస్టిక్ డ్రమ్ముల్లో రెండు, మూడు రోజులు ఊరబెట్టి నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇది ఎంతో ప్రమాదకరం. తాగిన వారు అనేక మంది బలయ్యారు. మారుమూల ప్రాంతాలు కావడంతో ఆ మరణాలు బహిర్గతం కావడం లేదు.

పక్క రాష్ట్రం నుంచి నల్ల బెల్లం

నాటు సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం తెలుగు తమ్ముళ్లకు కనకవర్షం కురిపిస్తోంది. అక్రమార్కులకు మాచర్లకు చెందిన టీడీపీ నాయకులు బెల్లం సరఫరా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొనుగోలు చేసుకొచ్చి అధిక ధరకు తయారీదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మాచర్ల ప్రధాన కేంద్రంగా నల్లబెల్లం వ్యాపారం మొదట కొనసాగినప్పటికీ ప్రస్తుతం సారా తయారీ చేసేవారందరూ అక్కడే కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. ఒక్క ఆటో నల్ల బెల్లం లోడ్ రూ.20 వేల వరకు మిగులుతున్నట్టు తెలియవచ్చింది.

శాశ్వత నిర్మూలనకు చర్యలేవి ?

పల్నాడు జిల్లాలో దశాబ్దాలుగా సారా తయారీ జరుగుతున్నప్పటికీ శాశ్వతంగా నిర్మూలించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సారా రక్కసిని కూకటి వేళ్లతో పెకిలించింది. గ్రామ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించి నియంత్రణకు కృషి చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో విచ్చలవిడిగా తయారు చేస్తున్నారు. నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్నా అదుపులోకి మాత్రం రావడంలేదు. తయారీదారులు, విక్రయదారులపై కఠినమైన శిక్షలు అమలు చేయడంతో పాటు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపి, నిరంతర నిఘా ఉంచితే తప్పా సారా రాక్షసిని అదుపుచేయడం కష్టమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు అప్పుడప్పుడు దాడులు జరిపి సారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేస్తున్నప్పటికీ కూటమి నేతల అండతో మరలా తిరిగి కొనసాగుతూనే ఉన్నాయి.

24 గ్రామాల్లో పూర్తిగా నిర్మూలించాం



జిల్లా వ్యాప్తంగా నాటు సారా తయారీ చేసే 28 గ్రామాలను గుర్తించాం. నవోదయం 2.0 కింద 24 గ్రామాల్లో సారాను పూర్తిగా నిర్మూలించాం. సారా వృత్తిగా బతుకుతున్న వారిలో చైతన్యం తెచ్చి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాం. 57 మంది సారా తయారీదారును గుర్తించి, అందులో అర్హులైన 23 మందికి డీఆర్‌డీఏ వారి సహకారంతో ఆర్థిక చేయూత అందించి ఉపాధి కల్పించబోతున్నాం. జిల్లాలో సారా తయారీదారులపై కఠినంగా వ్యవహరించి, నిర్మూలిస్తాం.

– మణికంఠ, పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

న్యూస్‌రీల్

సీఎస్‌సీ సేవల్లో ఏపీకి రెండో స్థానం



యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలో గల శ్రీ సాయిగణేష్ సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్) సెంటర్‌కు సేవల్లో దేశవ్యాప్తంగా రెండో స్థానం లభించింది. 16వ సీఎస్‌సీ దివస్ వేడుకలు ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిగణేష్ కేంద్రం నిర్వాహకులు, వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు అవార్డును అందుకున్నారు. సీఎస్‌సీ సీఈవో సంజయ్ కుమార్, రాకేష్ నుంచి ఆయన మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరసింహారావుకు పలువురు అభినందనలు తెలిపారు.

రేపు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం

నరసరావుపేట: కలెక్టరేట్‌లో శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నాలుగు గంటల వరకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్పీ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.కృష్ణ మోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26లో ఖరీఫ్ సాగుకు సాగర్ కుడి కాలువ పర్యవేక్షణ, నీటి విడుదలపై చర్చించనున్నట్లు తెలిపారు. సలహా మండలి బోర్డు సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్

కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు గురువారం పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులకు గ్రీవెన్స్ డే నిర్వహించి, నిర్దీత సమయంలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

శివాలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు





పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజుల పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్, స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో జరిగాయి. పవిత్రోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ డీసీ తెలిపారు. ఉదయం అన్నదానం, సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందని ఆయన తెలియజేశారు. పూజా కార్యక్రమాల్లో ప్రధాన అర్చకులు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, అర్చకులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు స్వీకరణ



నెహ్రూనగర్: సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ 2024–25 పోటీల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థకు ప్రతిష్టాత్మక అవార్డు లభించడం ఆనందంగా ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరాం, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రలు అవార్డును స్వీకరించారు. భవిష్యత్తులో గుంటూరు నగరాన్ని దేశంలోనే క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

పర్యవేక్షణ లేక ప'రేషాన్'

- ఆహార సలహా సంఘాల నియామకంపై అనిశ్చితి
- రేషన్ షాపులపై కొరవడిన అజమాయిషీ
- సరుకుల పంపిణీలో లోపాలు
- ప్రశ్నార్థకంగా ఆహార నాణ్యత
- నష్టపోతున్న కార్డుదారులు



రేషన్ షాపులో బియ్యం పంపిణీ

అమరావతి: రేషన్ షాపులపై పర్యవేక్షణతో పాటు సరుకులను సక్రమంగా అందించడం కోసం పనిచేసే ఆహార సలహా సంఘాల నియామకంపై అనిశ్చితి నెలకొంది. అజమాయిషీ లేకపోవడంతో అధికారులు, డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్డుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. సరుకుల పంపిణీలో లోపాలతో పాటు ఆహార నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

బియ్యం పంపిణీ వివరాలు

మండలం	షాపుల సంఖ్య	కార్డుల సంఖ్య	లబ్ధిదారులు	క్వింటాళ్లు
అమరావతి	45	22,175	61,563	4,018
పెదకూరపాడు	34	16,640	45,574	2,081
క్రోసూరు	43	19,809	57,048	2,715
అచ్చంపేట	50	20,695	59,632	2,730
బెల్లంకొండ	16	9,962	29,487	1,316

పట్టించుకోని అధికారులు

గతంలో ప్రతి మూడు నెలలకోసారి మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమయ్యేవారు. రేషన్ షాపుల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. నాణ్యత, తూకాలు పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో షాపుల ద్వారానే పంపిణీ చేస్తుండటంతో ప్రజలు కొన్నిచోట్ల ఇబ్బందులు పడుతున్నారు.

ఇదు మండలాలలో రేషన్ కార్డులు ఇలా..

పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో గల 188 రేషన్ షాపుల పరిధిలో 89,106 కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 2,53,304మంది లబ్ధిదారులకు 12,860 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం



రేషన్‌షాపులపై ప్రభుత్వం చిన్నచూపు చూడటంతో పాటు పేదలకు సరుకులు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. అరకొరగా చక్కెర అందిస్తున్నారే గానీ కందిపప్పు ఇవ్వడం లేదు. ఒక్క నెల కూడా పూర్తి స్థాయి కోటా ఇచ్చిన దాఖలాలు లేవు.

– భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, అమరావతి మండలం

ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ షాపుల్లో లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. ప్రస్తుత ప్రభుత్వం సంఘాలను ఏర్పాటు చేయకపోవడంతో అవినీతి చోటు చేసుకుంది.

– నూరిబాబు, సీపీఎం మండల కార్యదర్శి, అమరావతి

సంఘాలు ఏర్పాటు చేయాలి



మండల స్థాయిలో వెంటనే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సభ్యులతో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేయాలి. సంఘ సభ్యులు రేషన్ షాపుల్లో జరిగే అవకతవకలు, సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కార మార్గాలు సూచిస్తారు.

– భైరాపట్నం రామకృష్ణ, సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు

త్వరలో నియామకం



చౌక ధరల దుకాణాల పరిధిలో ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. త్వరలోనే నియామకానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను మా దష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

– దానియేల్, తహసీల్దార్, అమరావతి

మోసం, వంచనకు మారుపేరు చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం
- చిలకలూరిపేటలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' సభ నిర్వహణ
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



క్యూఆర్ కోడ్ ఉన్న పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చిలకలూరిపేట: మోసం, వంచనకు మారుపేరు చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం చిలకలూరిపేట పట్టణంలోని మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పూనూరు గౌతంరెడ్డి, పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో చిలకలూరి పేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పార్టీ అధ్యక్షులు దేవినేని శంకరరావు, మంగు ఏడుకొండలు, వడ్డేపల్లి నరసింహరావు, జిల్లా నాయకులు కంజుల వీరారెడ్డి, వలేటి వెంకటేశ్వరరావు, కందుల శ్రీకాంత్, సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి భాస్కరరెడ్డి, గుత్తా యాములయ్య, తాళ్ల అంజిరెడ్డి, కొప్పురావూరి పటేల్, మద్దూరి కోటిరెడ్డి, ఉడుతా వెంకటేశ్వరరావు, కొచ్చెర్ల కిషోర్ పాల్గొన్నారు.

అడగని హామీలు కూడా అమలు చేసిన జగన్ : పూనూరు గౌతంరెడ్డి

పార్లమెంటు పరిశీలకుడు పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజలు అడగని వాటిని కూడా అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, ఇంటింటికీ వైద్య సేవలు అందించారని చెప్పారు. చంద్రబాబు 20లక్షల ఉద్యోగాలు ఇస్తానని, రూ. 3వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తానని అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

హామీలను తుంగలో తొక్కిన బాబు: రజిని

మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ అన్ని హామీలను తుంగలో తొక్కిన ఘనత చంద్రబాబుదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని తన ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. సభ నిర్వహించేందుకు ఫ్లెక్సీలు ప్రింటింగ్‌కు ఇస్తే యజమానులకు ముద్రించవద్దని బెదిరింపులకు దిగారని తెలిపారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని పోలీసులు, మున్సిపల్ సిబ్బంది హంగామా సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వెనకడుగు పాలన: బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమం నిర్వహిస్తోందని, అది ముందడుగు కాదని, వెనకడుగు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని ప్రజలు గుర్తించాలన్నారు. అవినీతికి మారు పేరైన స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆడబిడ్డ గురించి మాట్లాడేటప్పుడు విజ్ఞత ఉండాలన్న విషయం మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండలో రషీద్ హత్యకు గురై సంవత్సరం అయిన సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించినట్లు తెలిపారు.

ఇంటింటికీ తెలియజెప్పాలి: నాగార్జున యాదవ్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు. వైఎస్ జగన్ పాలనలో జరిగిన మేలు, చంద్రబాబు పాలనలో జరిగిన మోసం గురించి వెల్లడించాలని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించాలని తెలిపారు.

కార్యకర్తలకే అధికార పగ్గాలు

డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

జిల్లా వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే అధికార పగ్గాలు అప్పజెబుతామని వెల్లడించారు. చంద్రబాబు అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరుమార్చి, ఇది తన తనయుడు లోకేష్ మనసులో నుంచి పుట్టిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం 30లక్షల మందికి తల్లికి వందనం చెల్లించటం లేదని విమర్శించారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

భట్టిప్రోలు: పిడుగుపాటుకు గురై బాపట్ల జిల్లాలో గురువారం ఇద్దరు మృతి చెందారు. భట్టిప్రోలు మండలం ఓలేరు శివారు వెంకటరాజు నగర్‌కు చెందిన గుంటూరు లూదు మరియన్న (70) పొలంలో పనిచేస్తుండగా గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం ఆరంభమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో సమీపంలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నాడు. అదే సమయంలో అతడికి అత్యంత సమీపంలో పిడుగు పడింది. పిడుగు ధాటికి గురై మృతి చెందాడు.

మహిళ మృతి

సంతమాగులూరు(అద్దంకి): పిడుగు పాటుకు మహిళ మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని ఏల్చూరు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వారు పొలాల్లో గేదెలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు ధాటికి పద్మ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలించారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగంలో పల్నాడుకు చోటు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొందరు పల్నాడను నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ మహిళా విభాగ కార్యదర్శిగా బూదాల మరియమ్మ, స్టేట్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా షేక్ అబ్దుల్ జలీల్ (మాచర్ల), స్టేట్ బూత్ కమిటీ వింగ్ కార్యదర్శిగా తుమ్మా వెంకటరెడ్డి (వినుకొండ) నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బూత్ కమిటీ వింగ్ అధ్యక్షులుగా కుర్రా వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా వింగ్‌కు బైరెడ్డి వరలారెడ్డి నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ నేతల విచారణ

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో ఇద్దరు వైఎస్సార్ సీపీ నేతలను గురువారం సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు నాగ మల్లేశ్వరరావు, ఎం.వి.సుబ్బారావులు విచారించారు. పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకర్రావు, పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలను వేర్వేరుగా పోలీస్టేషన్లలో విచారించి, వారి నుంచి సమాధానాలు రాబట్టి నమోదు చేసుకున్నారు. వీరి వెంట స్టేషన్‌కు వచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ బెల్లంకొండ మండల నాయకుడు చెన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి, క్రోసూరు, అమరావతి మండల నాయకులు నర్రా వాసు, మంగిశెట్టి కోటేశ్వరరావు ఉన్నారు.

జిల్లా స్థాయిలో మాచవరం పీహెచ్‌సీకి మొదటి స్థానం

రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం

మాచవరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు జూన్‌లో మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించినందుకు గానూ మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాలో మొదటి స్థానం దక్కిందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. ప్రసాదరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా అందిస్తున్న వైద్య సేవల్లోనూ రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిందని ఆయన తెలియజేశారు. ఇటీవల పీహెచ్‌సీల పనితీరుపై వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించిన నివేదికలో అధికారులు గ్రేడ్‌లను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

రైతులకు మోదం.. ప్రజలకు ఖేదం

- పల్నాడును ముంచెత్తిన వాన
- పలుచోట్ల నీట మునిగిన రోడ్లు
- భారీ వర్షంపై రైతుల హర్షం

సత్తెనపల్లి: నియోజకవర్గంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తొలుత ఈదురు గాలులు, ఉరుములతో ప్రారంభమై, ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడిలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. నివాసితులు బకెట్లతో తోడి బయటకు పోసుకున్నారు.

క్రోసూరులో..

మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో ఏకధాటిగా వర్షం కురిసింది. పంట పొలాలు, రోడ్లు వర్షం నీటితో నిండిపోయాయి. వారం రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు. మూగజీవాలు విలవిలలాడాయి. వర్షాల కోసం మండలంలో అనేక గ్రామాల్లో ప్రజలు దేవతలకు జలాభిషేకాలు చేశారు. క్రోసూరు, దొడ్లేరు, నాగవరం, ఊటుకూరు తదితర గ్రామాల ప్రజలు వర్షాల కోసం దేవుళ్లను మొక్కారు. పొంగళ్లు పెట్టుకుని, బొడ్రాయిలకు జలాభిషేకాలు చేశారు. గురువారం కురిసిన వర్షంతో ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

పెదకూరపాడులో..

వరుణుడి జాడ కోసం ఎదురుచూస్తున్న అన్నదాతల కోరిక ఫలించింది. నియోజకవర్గంలో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా చోట్ల పత్తి, కూరగాయల విత్తనాలు నాటారు. ఈ సమయంలో భారీ వర్షం కురియడంతో పంటలకు జీవం పోసింది. పలువురు రైతులు విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదకూరపాడులో వాగు పొంగి అమరావతికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది



పెదకూరపాడులో నీట మునిగిన రహదారి



గర్నెపూడిలో ఇళ్లలోకి వచ్చిన నీటిని తోడుతున్న మహిళ



క్రోసూరులో రోడ్డుపై నిలిచిన నీరు

రైతులకు అన్యాయం చేసిన కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి
- అన్నదాత సుఖీభవ రెండేళ్లుగా ఇవ్వలేదు
- పంటలకు దక్కని గిట్టుబాటు ధర
- కూటమి ప్రభుత్వానికి రైతులంటే చిన్నచూపు
- కిసాన్ మేళా వల్ల రైతులకు ప్రయోజనం కరువు



దాచేపల్లి : రైతులకు పెట్టుబడి సాయం మంజూరుతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి విమర్శించారు. ఆయన గురువారం రైతుల సమస్యలపై మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో పండించిన పత్తి, మిరప, మొక్కజొన్న, అపరాలు, ఇతర పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తీవ్రంగా అప్పుల్లో కూరుకుపోయారని ఆయన చెప్పారు. పల్నాడు ప్రాంత రైతులు గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అప్పులు తీర్చడం కోసం కిడ్నీలు అమ్ముకున్న దాఖలాలు ఉన్నాయని గుర్తు చేశారు. దయచేసి పల్నాడు ప్రాంత రైతులకు మళ్లీ ఆ దుస్థితిని తీసుకురావద్దని ఆయన కోరారు. దాచేపల్లిలో టీడీపీ నాయకులు హంగూ ఆర్భాటాలతో చేపట్టిన కిసాన్ మేళా వల్ల రైతులకు ప్రయోజనం శూన్యమని విమర్శించారు. మేళాలో పాల్గొన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కిసాన్ మేళా పెట్టింది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసమేనని తెలిపారు. పథకాలు ఇవ్వకుండా ప్రజలను మభ్య పెట్టేందుకే దీని నిర్వహించారని ఆయన ఆరోపించారు. కష్టాల్లో ఉన్న రైతులను తక్షణమే ఆదుకోవాలని, రెండేళ్లుగా నిలిచిన అన్నదాత సుఖీభవ కింద రూ. 40వేలను అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇప్పుడు నగదు అందిస్తే పెట్టుబడికి దోహదపడుతుందని ఆయన తెలిపారు. మిరప క్వింటాకు రూ.5వేలు, పత్తికి రూ.3వేలు, కందులు, మినుములు, శెనగకు కనీసం రూ.2,500వేల చొప్పున గిట్టుబాటు ధర ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో రైతుల సమస్యపై వైఎస్సార్ సీపీ బలంగా పోరాడేందుకు సిద్ధమవుతుందని ఆయన వెల్లడించారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తమ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాసు స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తాం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

దాచేపల్లి : వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు గురువారం కిసాన్ మేళా నిర్వహించారు. ఇందులో రైతుల ప్రదర్శనలను మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు , తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి పరిశీలించారు. ఆధునిక పద్ధతులను అవలంబించి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులు వ్యవసాయం చేయాలని మంత్రి రవికుమార్ చెప్పారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా తమ ప్రభుత్వం సహకారం అందించి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఏఎన్‌జీఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జి.శివన్నారాయణ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఏఎన్‌జీఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పి.వి సత్యనారాయణ, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు, డీఆర్‌ఓ మురళి, ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రైతుల్లో తీవ్ర అసంతృప్తి

పంటలకు కనీసం గిట్టుబాటు ధరతో పాటు పొగాకు కొనుగోలుపై కిసాన్ మేళాలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు నుంచి హామీ వస్తుందని రైతులంతా ఎదురు చూశారు. వీటిపై సరైన స్పష్టత ఇవ్వకుండానే మేళాను ముగించడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, పక్కన మంత్రి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు

గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల ధర్నా

నగరంపాలెం: రైతుబజార్‌లో రైతులు ఒక్కసారిగా ధర్నాకు దిగారు. గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అప్పుల పాలవుతున్నామని వాపోయారు. కృష్ణానగర్ కుందులరోడ్డు రైతుబజార్‌లో రైతులు గురువారం ఉదయం ఆందోళనబాట పట్టారు. దాదాపు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గుంటూరు నగరంలోని రైతుబజార్‌లకు కూరగాయల ధరలను నిర్ణయిస్తోంది. ఆ ధరల ప్రకారం ఆయా రైతు బజార్లల్లో విక్రయించాలి. కృష్ణానగర్‌లోని రైతుబజార్‌లో నెల రోజులుగా సరైన గిట్టుబాటు ధరలను నిర్ణయించడం లేదని పలువురు దుకాణాదారులు ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. గుంటూరు నగరంలోని వివిధ గ్రామాల నుంచి సరుకును తీసుకుని ఇక్కడికి వస్తుంటామని రైతులు తెలిపారు. 26 కిలోల టమాటా పెట్టె రూ.800 అని, దానిని ఆటోలో తీసుకురావడానికి రూ.20 చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అయితే, కిలో టమాటాను రూ.31లకు గురువారం నిర్ణయించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 26 కిలోల పెట్టెను కిలో రూ.31గా ధర నిర్ణయిస్తే రూ.806 అని తెలిపారు. తమకు ఏం గిట్టుబాటు అవుతుందని వాపోయారు. టమాటతోపాటు ఇతర కూరగాయలు, ఆకుకూరల ధరల పరిస్థితి కూడా అలాగే ఉందని తెలిపారు. దీంతో సరైన గిట్టుబాటు ధరల్లేక వ్యాపారుల వద్ద వడ్డీలకు నగదు తీసుకొచ్చి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. రైతుల ధర్నాతో కొనుగోలుదారులు ఇబ్బందులకు గురయ్యారు.

చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య వరం

క్రోసూరు: వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య వరం అని జిల్లా కో–ఆర్డినేటర్ ఎంఏ.హుస్సేన్ తెలిపారు. క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దూరవిద్య అడ్మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కో–ఆర్డినేటర్ చిల్కా సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా విద్యార్థులు పొందే సర్టిఫికెట్లకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెగ్యులర్ విద్యార్థులతో పాటు సమానమైన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 24 సంవత్సరాలు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. చదవడం, రాయడంతో పాటు ఏడొక తరగతి టీసీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఇంటర్‌కు 10వ తరగతి మార్క్స్ సర్టిఫికెట్, టీసీ, బ్యాంకు అకౌంట్ కాపీ అందజేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అయితే కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులు అయితే వైకల్యం ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. ఫీజు చెల్లింపునకు అపరాధ రుసుం లేకుండా ఈనెల 30 వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 15 వరకు అవకాశం ఉందని తెలియజేశారు. వివరాలకు పని వేళల్లో మండల రిసోర్సు కేంద్రంలో, సచివాలయాల్లో , మండల కో–ఆర్డినేటర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. మీసేవ, ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ హుస్సేన్ తదితరులు

హెచ్ఐవీ రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. మంజుల

నరసరావుపేట: ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు తీసుకునే హెచ్‌ఐవీ రోగులు ప్రతిరోజు సరైన సమయానికి వాటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల చెప్పారు. తన కార్యాలయం నుంచి గురువారం జిల్లా మెడికల్ అండ్ హెల్త్, ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో జూలై నాటికి చేసిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించడం ద్వారా ఆ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు తీసుకోని వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. తిరిగి మందులు వాడేలా చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాడడం వల్ల వైరల్ లోడ్ పూర్తిగా అదుపులో ఉంటుందని చెప్పారు. వైరల్ లోడ్ పరీక్షలో 200 కన్నా తక్కువ కాపీలు వస్తే వారిద్వారా ఇతరులకు హెచ్‌ఐవీ వ్యాపించదని తెలిపారు. సుఖ వ్యాధులను గుర్తించి భాగస్వామి సహా పూర్తికాలం మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా, జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ శశిధర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్తేశ్వరుని సాక్షిగా ఇసుక అక్రమ తవ్వకాలు

రేపల్లె: దక్షిణకాశీగా పేర్గాంచిన రేపల్లె మండలం మోర్తోటలో పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయ సమీపంలో కూటమి నేతల కనుసన్నలలో అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆలయానికి 300 మీటర్ల దూరంలో కృష్ణమ్మ ఒడ్డున జేసీబీలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రసిద్ధిగాంచిన ముక్తేశ్వరస్వామి ఆలయానికి సాధారణ రోజులతో పాటు కార్తికమాసంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుని కృష్ణానదిలో పుణ్యస్నానమాచరిస్తుంటారు. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉండటంతో ఇదే అదునుగా భావించిన కూటమినేత కనుసన్నలలో ఇసుకాసురులు జేసీబీల ద్వారా గుంతలు తవ్వి ఇసుకను తరలిస్తున్నారు.



ఆలయం సమీపంలో అక్రమ తవ్వకాలు

ఎక్కడో హత్య .. ఇక్కడే దహనం!

- మిస్టరీగా మారుతున్న శవ దహనాలు
- ఒకే తీరున మూడేళ్లలో నాలుగో ఘటన
- పోలీసులకు సవాల్‌గా మారిన ఘటనలు

యడ్లపాడు: మండలంలో వరుసగా నమోదవుతున్న అజ్ఞాత శవాల దహనం ఘటనలు పోలీసులు సవాలుగా మారాయి. తాజాగా జూన్ 25న ఉదయం 8.30 గంటల ప్రాంతంలో 16వ జాతీయ రహదారి పక్కన పట్టపగలే శవ దహనం స్థానికులను కలవరపెట్టింది. 20 రోజులకు పైగా గడుస్తున్నా ఇప్పటివరకు ఈ కేసు మిస్టరీగానే ఉంది. హత్య చేసిన తర్వాత మృతదేహాలను యడ్లపాడు మండలంలో దహనం చేయడం హంతకుల వ్యూహంలో భాగమని పోలీసులు అనుమానిస్తున్నారు.

మూడేళ్లలో నాలుగు ఘటనలు

గత మూడేళ్లలో మండలంలో మొత్తం నాలుగు శవ దహనాల ఘటనలు నమోదయ్యాయి. బోయపాలెం– వంకాయలపాడు గ్రామాల మధ్యలో హైవే సర్వీసు రోడ్డు పక్కన చెత్తకుప్పలో ఒకరిని, యడ్లపాడు నుంచి చిలకలూరిపేట వెళ్లే మార్గంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన అండర్‌పాస్ వంతెన సమీపంలో సుబాబుల్‌తోట పక్కనే ఒకరు, సొలస గ్రామంలోని శ్మశానవాటికలో ఒకరిని కాల్చివేసిన సంఘటనలు వెలుగు చూశాయి. తాజాగా గతనెల 25న జరిగిన ఘటన వీటి జాబితాలోకి వచ్చి చేరింది.



యడ్లపాడు హైవే పక్క కాల్వలో ఫ్లెక్సీ చుట్టి దగ్ధమైన శవాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆ ఒక్కటే ఆధారం !

చివరగా జరిగిన ఘటనలో మాత్రం ఒక ఆధారం లభించింది. హంతకులు పట్టపగలే ఫ్లెక్సీ షీట్‌లో చుట్టిన శవాన్ని హైవే పక్కనున్న కాల్వలో పడేసి నిప్పంటించి పరారయ్యారు. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తూ ఆవైపు వెళ్లిన పోలీసులు మంటలు గమనించి, వాహనంలోని నీటితో మంటలను ఆర్పారు. అయితే, అప్పటికే శరీరం పూర్తిగా కాలి బూడిదైంది. ముఖ భాగం మాత్రమే కొంతమేర మిగిలింది. ఆ ఒక్క ఆధారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి గురించి ఏ పోలీస్ స్టేషన్‌లోనూ మిస్సింగ్ కేసు రిజిస్టర్ కాకపోవడం పోలీసులకు ట్విస్ట్‌గా మారింది. హంతకులు శవాన్ని ఫ్లెక్సీ షీట్‌తో చుట్టి నిప్పు పెట్టిన విషయం తప్పా హత్యకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఏవీ లభించలేదు. పెట్రోల్ పోసి పూర్తిగా దహనం చేయడంతో ఆధారాలు మిగలకుండా జాగ్రత్త పడ్డారు. పోలీసులు శవం ముఖం ఫోటోనే కీలక ఆధారంగా చేసుకుని కేసును ఛేదించే ప్రయత్నం చేస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ సహకారంతో డీఎన్‌ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు చేపట్టారు. ఘటన జరిగిన తేదీన అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలపై నిఘా పెట్టారు. ఈ ఒక్క హత్యకేసు ఛేదించగలిగితే మిగిలిన వాటిలో ఏదన్న ఆధారం లభిస్తుందేమోనని పోలీసులు భావిస్తున్నారు.

నకిలీ సర్వే సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తికి రిమాండ్

పెదకాకాని: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్వే సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని వెంగళరావునగర్‌కి చెందిన కూరాకుల సత్యన్నారాయణ, అనూష దంపతులు తమ ఇంటిని విక్రయానికి పెట్టారు. ఇంటిని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ ఇచ్చిన సత్యదేవ్ అనే వ్యక్తి బ్యాంక్ రుణం పొందేందుకు సర్వే సర్టిఫికెట్ కోరడంతో నకిలీ పత్రాన్ని ఆయన ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పంపించారు. బ్యాంకర్లను కలిసిన ఆయన అనుమానం వచ్చి తహసీల్దార్ కృష్ణకాంత్‌ను పత్రం గురించి తెలిపారు. విచారణలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ పత్రం సృష్టించినట్లు నిరూపణ అయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సత్యన్నారాయణను గురువారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

టౌన్ హాలుకు ఘన చరిత్ర

బాపట్ల అర్బన్: అనాదిగా ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు బాపట్ల టౌన్ హాల్ పట్టుగొమ్మగా నిలిచిందని బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా అన్నారు. టౌన్ హాలు 120వ వార్షికోత్సవ కార్యక్రమంలో గురువారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ టౌన్ హాల్‌ను 1905 జూలై 17న అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ బ్రూడీ ప్రారంభోత్సవం చేశారన్నారు. టౌన్ హాల్‌కు 12 దశాబ్దాల చరిత్ర ఉందని తెలిపారు. ఎందరో జాతీయ నాయకుల ప్రసంగాలకు వేదికగా టౌన్ హాలు నిలిచిందని పేర్కొన్నారు. 1913లో ప్రథమాంధ్ర మహాసభ ఇక్కడే జరిగిందని తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు ఇక్కడే బీజం పడిందని తెలిపారు. ఇది ఎందరో కవులు, కళాకారులకు ఆలంబనగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి. సి. సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏవీ రమణారావు, రచయిత మల్లికార్జున, ఖాజీపాలెం డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ కృష్ణంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



తెలుగు తల్లి విగ్రహం వద్ద బాపట్ల ఆర్డీఓ గ్లోరియా

విజ్ఞాన్ వర్సిటీకి రూ.58.27 లక్షల ప్రాజెక్ట్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఆర్. చరణ్ రాజుకు ఢిల్లీలోని ఏఎన్‌ఆర్‌ఎఫ్– పీఎంఈసీఆర్‌జీ (అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ - ప్రైమ్ మినిస్టర్స్ ఎర్లీ కెరియర్ రీసెర్చ్ గ్రాంట్) నుంచి రూ.58.27 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ''స్టడీ ఆఫ్ యాంటీ–లీష్మానియల్ యాక్టివిటీ ఆఫ్ బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఐసోలేటెడ్ ఫ్రమ్ సీడ్స్ ఆఫ్ కారికా పపాయా అగెనెస్ట్ లీష్మానియా డోనోవాని'' అనే అంశంపై పరిశోధనకుగాను రాబోయే మూడు సంవత్సరాలకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. ఎం.ఆర్. చరణ్ రాజును చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ పీఎంవీ రావు అభినందించారు.

‘కూటమి’ ఒత్తిడితోనే పోలీసులు వేధిస్తున్నారు

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు గురిజవోలు బాధితుల ఫిర్యాదు

నరసరావుపేట రూరల్: పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బాధితులమైన తమపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడిలతో నరసరావుపేట రూరల్ పోలీసులు వేధింపుల నుంచి కాపాడాలని నాదెండ్ల మండలం గురిజవోలుకు చెందిన కొండెబోయిన శ్రీనివాసరావు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ కోరారు. విజయవాడకు వచ్చిన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహీర్‌ను గురువారం శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. మైనర్ అయిన తన కుమార్తెను అనుసరిస్తూ గ్రామానికి చెందిన పుల్లపు విజయ్ కుమార్ కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. బాలికను హతమార్చే ఉద్దేశంతో కిడ్నాప్ కూడా పాల్పడ్డారని వాపోయారు. పోలీసులు బాలికను గుర్తించి తమకు అప్పగించారని తెలిపారు. కుటుంబ గౌరవం గురించి ఆలోచించి నిందితుడిపై ఎటువంటి ఫిర్యాదు చేయలేదన్నారు. విజయకుమార్ బెదిరింపుల కారణంగా బాలికను తన అమ్మమ్మ గ్రామమైన నరసరావుపేట మండలం దొండపాడులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఆ గ్రామానికి వెళ్లి బాలికను బెదిరించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారని, ఈ సమయంలో మోటర్ సైకిల్, ఫోన్‌లు వదిలి పారిపోయాడని తెలిపారు. విజయకుమార్ వేధింపులతో బాలిక మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో 11 రోజుల పాటు ఐసీయూలో చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. బాలిక ఫిర్యాదుతో విజయకుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో విజయకుమార్ కనిపించడం లేదని అతని తల్లిదండ్రులు గ్రామీణ పోలీస్‌స్టేషన్లో ఉద్దేశపూర్వకంగా కేసు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడిలతో అప్పటి నుంచి రూరల్ పోలీసులు తమను వేధిస్తున్నారని తెలిపారు. తనతో పాటు కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని తెలిపారు. ఈనెల 12వ తేదీన తన కుమారుడు పవన్‌కుమార్ స్టేషన్‌కు పిలిపించి కేసును ఒప్పుకోవాలంటూ విచక్షణా రహితంగా కొట్టారని పేర్కొన్నారు. కేసును అంగీకరించకపోతే ఎన్‌కౌంటర్ చేస్తామని బెదరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పనిచేస్తున్న పోలీసుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంగళరావు యాదవ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళ్ల శివగోపి పాల్గొన్నారు.



చైర్మన్ గంగారామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు